ప్రజాశక్తి
గురువారం 4 మే 2023

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనాగ్రహం వ్యక్తం అయ్యింది. బుధవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సిపిఎం, సిఐటియు, వ్యకాసం, రైతు తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ప్రయివేటీకరణ చేస్తున్న కేంద్రం, దానిని అడ్డుకోకుండా మౌనంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనలను పోలీసులు బలవంతంగా అణచివేసేందుకు ప్రయత్నించారు. మంగళవారం రాత్రి నుంచి ఎక్కడికక్కడ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులను గృహ నిర్బంధం చేశారు. బుధవారం ఉదయం తపోవనం నుంచి ర్యాలీగా వస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ప్రభుత్వం పోలీసుల చేత నిరసనలను భగ్నం చేయించే కుట్ర చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- విశాఖ ఉక్కును ప్రయివేటీకరణను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- అనంత నిరసనలో ఉద్రిక్తత
- సిపిఎం, సిఐటియు నేతలను రోడ్డుపై ఈడ్చుకుంటూ అరెస్టులు
- ప్రభుత్వం, పోలీసుల తీరుపై నిరసనాగ్రహం

ఉద్యమంపై... 'ఉక్కు'పాదం..!

అనంతపురం తపోవనం వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్‌ను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

తపోవనం జాతీయ రహదారిపై రాస్తారో చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అనంతపురంలో సిఐటియు, సిపిఎం చేపట్టిన రాస్తారోకో కార్యక్రమాన్ని అడ్డుకుంటూ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు జులూం ప్రదర్శించారు. బుధవారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' ప్రయివేటీకరణ ఆపాలంటూ తపోవనం జాతీయ రహదారిలో రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాంగా జిల్లాలో రాస్తారోకోలకు సిద్ధమైన సిఐటియు, సిపిఎం నాయకులను పోలీసులు ఉదయం నుంచి గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేసి అడ్డుకునేందుకు యత్నించారు. పోలీసుల అడ్డకుంలను దాటుకుని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు తపోవనం సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు.తపోవనం సర్కిల్‌కు చేరుకుని ప్రజల ఆస్తి విశాఖ ఉక్కును పరిరక్షించాలని నినాదాలు చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు ఒక్కసారిగా నాయకులను ఇష్టం వచ్చినట్లు రోడ్డుపై ఈడ్చుకుంటూ లాగిపడేశారు. నాయకులను బలవంతంగా అరెస్ట్ చేశారు. వాహనాల్లో ఇష్టం వచ్చినట్లు ఎత్తిపడేసి జులూం ప్రదర్శించారు. ఈ క్రమంలో కొందరు నాయకులు స్పృహతప్పి కింద పడ్డారు. మరికొందరికి గాయాలయ్యాయి. 30 నిమిషాల పాటు జాతీయ రహదారిలో ఉద్రిక్తతల నెలకొంది. తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఉద్యమకారులను అరెస్ట్ చేసి మూడవ, నాల్గవ పట్టణం పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఉదయమే రాజీవ్ కాలనీ ఉప సర్పంచి మసూద్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వన్నూరు వలి ఖాన్, సిఐటియు నగర అధ్యక్షులు బాబు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజులను అరెస్టు చేశారు. అరెస్టులు చేసే సమయంలో సిపిఎం, సిఐటియు కార్యకర్తలు ఉక్కుమాదే, దానిపై హక్కు మాదే, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోతే సహించేది లేదంటూ హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, రైతు, ప్రజాసంఘాలు కలుపుకుని ఐక్యంగా ప్రజా ఉద్యమంగా ముందుకు వెళతామన్నారు. ప్రభుత్వం నిర్బంధ చర్యలకు, అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తి లేదని ఎటువంటి త్యాగానికైనా సిపిఎం, ప్రజా సంఘాల, కార్యకర్తల సిద్ధమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, సిపిఎం నగర కార్యదర్శి వి. రామిరెడ్డి అన్నారు. బిజెపి అన్ని ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పడం లాభాలు వస్తున్న పరిశ్రమలని బహిరంగ మార్కెట్లో ఉన్నదానికంటే 80 శాతం తక్కువగా విక్రయిస్తుండటం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాట ఆడుతుండం దుర్మార్గంగా ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటుకరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంత ఏ ప్రయోజన కోసం బిజెపికి అనుకూలంగా మాట్లాడుతున్నారో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు బహిరంగంగా చీకటి ఒప్పందాలను తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు కట్టపడి కట్టుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మడం అంటే తమ తల్లిని అమ్మడమే అవుతుందన్నారు. అరెస్టైన వారిలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, చీమల ప్రకాష్‌రెడ్డి, ప్రసాద్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, ఆటో యూనియన్ నాయకులు ఆదినారాయణ, అజామ్‌బాషా, గఫూర్, నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, జీవరత్నం, రాజు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అక్రమం : వి.రాంభూపాల్

విశాఖ ఉక్కు పరిశ్రమలను కాపాడుకుందామని నిరసన తెలియజేస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అరెస్టులు చేయించడం అన్యాయంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అంటూ తపోవనంలో చేపట్టిన రాస్తారోకోను పోలీసులు అడ్డుకుని సిఐటియు, సిపిఎం నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాస్తారోకోలు అడ్డుకుని నిర్బంధాలు విధించడం దుర్మార్గంగా ఉందన్నాడు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమానికి నాయకత్వం వహించాల్సిందిపోయి, నిర్బంధానికి పూనుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ ఉద్యమంలో అరెస్టు అయిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి, కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

గంతకల్లు డివిజన్‌లో

కలెక్టర్ సుడిగాలి పర్యటన

- అభివృద్ధి పనుల పరిశీలన
- సచివాలయాలు, అంగన్‌వాడీల తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి, గుంతకల్లు

కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం నాడు గుంతకల్లు డివిజన్‌లోని పలు మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పామిడి గ్రామం, నాగిరెడ్డి కాలనీ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. జూన్‌లోగా పాఠశాలలో నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ పరిస్థితులను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామ సచివాలయం తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ వైఎస్సార్ బీమా పథకంలో నమోదు చేయించాలన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో రూ.20 లక్షల మేరకు చేపట్టే పనుల అంచనా వ్యయాలు తయారు చేయాలని సర్పంచి రంగమ్మకు సూచించారు. పత్తి పంటలో నష్టపోయిన స్థానిక రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు త్వరలోనే జీతాలు చెల్లిస్తామని తెలిపారు. పామిడి మండలం నుంచి గుత్తిలో పర్యటించారు. గుత్తి పట్టణం నేమతాబాద్ అర్బన్ హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించారు. గుంతకల్లు దోనముక్కల హౌసింగ్ లే అవుట్‌నూ సందరించారు. దోనముక్కల హౌసింగ్ లేఅవుట్‌లో గుంతకల్లు మునిసిపాలిటీ వైస్‌ఛైర్‌పర్సన్ నైరుతి రెడ్డి స్వాగతం పలికారు. అక్కడ జగనన్న ఇల్లు లబ్ధిదారురాలు అలశ్యాము సౌమ్య ఇంటి గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మే లో నిర్వహించనున్న మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి. ఇళ్ల పట్టా పొందిన ప్రతి డ్వాక్రా మహిళకు 35,000 రూపాయల రుణం అందించాలని అధికారులకు సూచించారు. డ్వాక్రా సంఘాల్లో లేని మహిళలకు సంఘాలలో సభ్యత్వం కల్పించాలన్నారు. రుణం పొందేందుకు కనీసం ఆర్నెళ్లు సంఘంలో సభ్యత్వం ఉండాలనే నిబంధనను సవరించి రుణం మంజూరు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాల కబ్జాలపై విచారణ చేపట్టాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. బోగస్ పట్టాల వివరాలు తేల్చి వాటిని 90 రోజుల్లో ఇళ్ల పట్టా దరఖాస్తుదారులకు అందించాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు జారీ చేయాలన్నారు. అనంతరం గుంతకల్లు ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి విస్తరణ పనుల గురించి సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. వజ్రకరూరు జగనన్న లే అవుట్‌ను తనిఖీ చేసి, ఉదులో నిర్మాణాల పురోగతిపై సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ భవన్‌లో ఈకెవైసి సదుపాయం

ఈకేవైసీ అనుసంధాన కార్యక్రమంలో పాల్గొన్న పెన్షనర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌లు, ఫ్యామిలీ పెన్షనర్‌లు ఈకెవైసి అనుసంధానం కోసం జిల్లా పెన్షనర్స్ భవన్‌లో సదుపాయం కల్పించినట్లు పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప తెలిపారు. బుధవారం నాడు ఎన్జీవో హోంలోని పెన్షనర్స్ భవన్‌లో జిల్లా ట్రెజరీ అధికారుల సూచనల మేరకు పెన్షనర్‌లకు ఈకెవైసి అనుసంధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ట్రెజరీ అధికారుల సూచనల మేరకు 3వ తేదీ నుంచి పెన్షనర్‌లు పెన్షన్ ఐడి సిఎఫ్ఎంఎస్ నంబర్‌కు అనుసంధానంగా ఉన్న ఆధార్ నెంబర్‌ను ఈకెవైసి లింక్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనంతపురం ఎస్టీవో పరిధిలో ఉన్న పెన్షనర్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ అభ్యర్ధన మేరకు ఈకెవైసి సదుపాయం సిబ్బందిచే కల్పించినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకెవైసి కార్యక్రమం ఎస్టీవో అనంతయ్య, పర్యవేక్షణలో సీనియర్ అసిస్టెంట్ మసూద్ వలి, అకౌంటెంట్ చేత ఈకెవైసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా కోశాధికారి రామక్రిష్ణ, కార్యవర్గ సభ్యులు దేనియల్ ప్రభాకర్, చంద్రశేఖర్ రెడ్డి, వరదరాజులు, మధు, అనంతయ్య, పెన్షనర్స్ భాస్కర్ రెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రానున్న 4, 5 రోజుల్లో అకాల వర్షాలు పడే ఆవకాశం ఉందని, ప్రజలు ప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విపత్తు నిర్వహణ సంస్థ వారు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహం దగ్గరగా ఉన్నపుడు, ఉరుములు, మెరుపులు, వచ్చు సమయంలో పిడుగుపాటుకు ఆవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి సమయంలో చెట్లు కింద, చెట్ల సమీపములో టవర్స్, చెరువులు దగ్గర ఉండరాదన్నారు. ఎలక్ట్రికల్, ఎలెక్ట్రానిక్ వస్తువులు ఇతర పరికరాలు మొబైల్ ఫోన్ ఉపయోగించరాదన్నారు. విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంబాలకు దూరంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్పా ప్రయాణాలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవానలి కోరారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 8500292992కు సంప్రదించాలని కోరారు.

చదువుతోనే అభివృద్ధి

మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విద్యతోనే జీవితంలో అభివృద్ధి సాధించగలమని, ప్రతి విద్యార్థీ కష్టపడి చదవి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల తలరాతలు మారాలంటే విద్య ఒక్కటే సరైన మార్గం అన్నారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి పలు చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ సంవత్సరం ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రత్యేకంగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి 37 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. వీరికి నియామక పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

జెఎన్‌టియు ఫార్మాడీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఫార్మాడీ, ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షలు విభాగం డైరెక్టర్ ఆచార్య ఇ.కేశవరెడ్డి బుధవారం తెలిపారు. ఫార్మాడీ నాలుగవ, ఐదవ సంవత్సరం (ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ ఐదవ సంవత్సరం (ఆర్14) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండవ సెమిస్టర్, నాలుగవ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంఎస్‌సి మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ ఫలితాలు, ఎంసీఏ మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ ఆచార్య బి.చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌ను ను సంప్రధించాలని తెలిపారు.

అందరి సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో అందరికీ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీలో బుధవారం నాడు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. జడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బడుగు, బలహీన, ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారని ప్రజలకు తెలిపారు. కాలనీలో అనారోగ్య, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు జగన్న స్టిక్కర్లను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఎన్నడూ లేనంతగా 'అనంత' అభివృద్ధి

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా అభివద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని విమర్శించడమే ప్రతిపక్షాల పని అన్నారు. నగరం శరవేగంగా అభివద్ధి జరుగుతుంటే కళ్లుండి చూడలేని కబోదుల్లా ప్రతిపక్ష నేతలు వ్యవహరిస్తే తామేమీ చేయలేమన్నారు. ప్రజలకు తాము జవాబుదారీగా ఉంటామని, తమ బాధ్యతలను ఎన్నటికీ విస్మరించేది లేదని స్పష్టం చేశారు. నగరంలోని 14, 15 డివిజన్ల పరిధిలో బుధవారం కార్పొరేటర్లు అబూసాలెహా, మల్లికార్జునలతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 95 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. గుత్తి రోడ్డు, బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకూ రోడ్ల విస్తరణతో పాటు సీఎం జగన్ ప్రత్యేక చొరవతో రూ.25 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, వంతెనల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. 2014 నుంచి 2019 వరకూ టిడిపి అధికారంలో ఉందని.. బీజేపీ, జనసేన మద్దతుగా నిలిచాయన్నారు. ఆ ఐదేళ్లు నాయకులు మాటలకే పరిమితం అయ్యారన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరంలో ఎంత అభివద్ధి జరిగిందో చూడాలని హితవు పలికారు. నగరంలో అక్రమ కట్టడాల విషయంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులే కాకుండా ప్రజలు కూడా మన ఊరు బాగుండాలి అని ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, జాహ్నవి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పారదర్శక పాలన అందించడంలో భాగంగా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా పంచాయతీల పరిధిలోనే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆలూరు, వంగనూరు గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకే భవనాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాల వద్ద ఆయన మండల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వారితో కలిసి ఆయా కార్యాలయాల నూతన భవనాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గ్రామ సచివాలయాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు సుదూర ప్రాంతాల్లోని కార్యాలయాలకు వెళ్లకుండా ఇక్కడే సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలకు పరిష్కారం చూపుతారని తెలిపారు. రైతులు ఆర్బీకేలు అందించే సేవల ద్వారా వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని, వాటిని ఆయా పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ రంగారావు, సర్పంచి అరుణ, యువ నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, వైసీపీ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు యువత జీవితంలో భాగం కావాలి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, ప్రతి యువకుడు క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నెల రోజులుగా ఈగల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. ఈ వేడుకల్లో మేయర్ వసీంతో పాటు డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొని టోర్నీ విజేతగా నిలిచిన బుక్కరాయసముద్రం జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నగరంలో క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఆర్గనైజర్లు శరత్‌చంద్ర, శ్రావణ్ కుమార్, సందీప్ ఇలాంటి టోర్నీలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన జట్టుకి ట్రోఫీతో పాటు రూ.50వేలు, రన్నర్స్‌గా నిలిచిన సురేష్ టీమ్‌కు ట్రోఫీ రూ. 25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, లీలావతి, ఆర్గనైజర్లతో పాటు టీం సభ్యులు సురేష్ బాబు, సందీప్, వేణు, రవితేజ, కుల్లాయి, షమీవుల్లా, తదితరులు పాల్గొన్నారు

'నాడు-నేడు' పనులపై సమావేశం

పుట్లూరు:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నాడు-నేడు పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మండల స్థాయి అధికారులు, ఎంపీడీవో యోగానందరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని హెడ్ మాస్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఎంఈఓ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

స్థానిక కస్తూర్బా విద్యాలయంలో జరుగుతున్న నాడు-నేడు పనులను మండల ప్రత్యేకాధికారి రజనీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపిడిఒ యోగానంద రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్ ప్రసాద్, ఎంఈఓ శ్రీదేవి, ఇతర మండల అధికారులు ఉన్నారు.

పుట్లూరులో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి

డ్వాక్రా రుణమాఫీపై టిడిపి సమాధానం చెప్పాలి:విప్ కాపు

రాయదుర్గం: 2014 ఎన్నికలకు ముందు పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేశారో లేదో టిడిపి నాయకులు సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడు దల చేశారు. 40 ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకొనే చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు పొదుపు సంఘాలకు డ్వాక్రా రునం మొత్తం మాఫీ చేస్తామని హామీ ఇచ్చారా? లేదా, ఇస్తే అమలు చేశారా లేదా రాయదుర్గం పచ్చ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని కోరారు. అప్పటి మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత అసెంబ్లీలో మాట్లాడుతూ 2014-18 కాలంలో రాష్ట్ర ప్రభు త్వం ఎలాంటి డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదని, అలాంటి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేశారన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట తప్పి మహిళలను మోసం చేశారని, వారికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన మాట తప్పడం వల్లనే గత ఎన్నికల్లో టిడిపి 23 సీట్లకు పరిమితమైందన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

ఉరవకొండ: కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర, కర్నాటక సరిహద్దు విడపనకల్లు మండల పరిధిలోని డొనేకల్లు, హావలిగి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కర్నాటక సరిహద్దు చెక్ పోస్టులను బుధవారం గుంతకల్లు డివిజన్ డిఎస్పి నర్సింగప్ప తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందుగా వాహనాల నమోదు రిజిస్టంను పరిశీలించారు. అలాగే వాహనాల రాకపోకలపై ప్రత్యేక దష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అక్రమంగా డబ్బు, మద్యం, మారణాయుధాలు వెళ్లకుండా నిరంతరం వాహనాలను తనిఖీలు చేయాలని, ప్రత్యేక నిఘా పెట్టాలని డిఎస్పి చెక్ పోస్టు సిబ్బంది ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ రూరల్ సిఐ శేఖర్, సెబ్ ఎస్ఐ రమణారెడ్డి, ఏఎస్ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో విజయోత్సవ సంబరాలు

నార్పల:స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో బుధవారం ఉద్యోగ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగనమల శాసనసభ్యురాలు జొన్నలగడ్డ పద్మావతి పాల్గొని అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్ పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డేవిడ్ , కళాశాల సిబ్బంది, వైసిపి సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

బెళుగుప్ప: మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్స వం వైభంగా నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వం స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాత ల సహకారంతో సుందరంగా తీర్చిదిద్ది ఆలయంలో రెండు రోజుల పాటు ధ్వజారోహణం, మహాగణపతి, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామానికి అరిష్టం జరగకుండా, పాడి పంటలతో సుభిక్షంగా ఉండేందుకు బుధవారం ఉదయం వేద పండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమ రెడ్డి హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. సాయంత్రం శివపార్వతుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరిం చిన ట్రాక్టర్లలో కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు. రాత్రి భజన చేశారు. కార్యక్రమంలో సర్పంచి చిప్పగిరి ప్రకాష్ రెడ్డి, అంగిడి స్వామి, శివన్న, నరిగన్న, శివ, దుద్దేకుంట సూరి, బోయ వెంకటేశ, మోహన్, పాల్గొన్నారు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం, సిపిఐ నాయకులు.. ఉరవకొండలో సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు.. వజ్రకరూరులో పోలీసుల అదుపులో సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి

'విశాఖ ఉక్కు' ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఉపసంహరించుకునేంత వరకూ ఉద్యమాలు ఆపే ప్రసక్తే లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున హెచ్చరించారు. ఐదు కోట్ల తెలుగు ప్రజల ఆత్మ గౌరవంగా భావించే విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అప్పనంగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సిపిఎం, సిపిఐ, సిఐటియు నాయకులను పోలీసు లు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు:వామపక్షాలు

గుంతకల్లు: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రాణాలైనా అర్పిస్తామని, అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని వామపక్షాల నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో సిపిఎం, సిపిఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రాస్తారోకోను భగ్నం చేసి నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నింటినీ అదానీ, అంబానీ కార్పొరేట్ కంపెనీలకు అతి తక్కువ ధరలకు కట్టబెడుతోందన్నారు. మోడీకి వత్తాసుగా రాష్ట్రంలోని జగన్ రెడ్డి ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఉద్యమాలు చేస్తున్న వారిని పోలీసులతో ఎక్కడికక్కడ అణిచివేతలు, గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేయిస్తోందని మండిపడ్డారు. అరెస్టు అయిన వారిలో సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, తిమ్మప్ప, రాము నాయక్, మారుతీ ప్రసాద్, అబ్దుల్లా, షబ్బీర్ బాషా, వెంకీ, సిపిఐ నాయకులు దేవేంద్ర, సురేష్, వీరన్న తదితరులు ఉన్నారు.

గుంతకల్లులో సిపిఎం, సిపిఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

అరెస్టులకు భయపడం..

శింగనమల: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక హైవేపై రాస్తారోకో, నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. అయితే బుధవారం ఆయా కార్యక్రమాలకు వెళ్లకుండా డి.చిన్నప్పయాదవ్‌తో పాటు శింగనమల సీపీఐ మండల కార్యదర్శి టి.రామాంజనేయులు, చేనేత మండల కార్యదర్శి, నేసే మధు, లక్ష్మిరంగయ్య, రామసుబ్బారెడ్డి, ఓబిరెడ్డి, ఆదెన్న, రవిశంకర, నాగరాజు, శ్రీనివాసులు, తదితరులను శింగనమల పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు భయపడి వెనక్కు తగ్గమని హెచ్చరించారు.

నిర్బంధాలతో ఆపలేరు..

పుట్లూరు: నిర్బంధాలతో విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ఆపలేరని సిపిఐ మండల కార్యదర్శి డి.పెద్దయ్య పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక పిలుపునిచ్చిన రాష్ట్ర వ్యాప్త రాస్తారోకో కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేయడం దారుణం అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి తేటతెల్లం అవుతోందన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకే పోలీసులు ఇంటికి వెళ్లి ముందస్తు అరెస్టులు చేయడం దారుణమన్నారు. అరెస్టు అయిన వారిలో చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షుడు సి.ఓబులపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వీరయ్య, రైతు సంఘం నాయకులు పెద్ద కొండయ్య, బాల కొండయ్య, తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు దారుణం..

ఉరవకొండ: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడతారని ముందస్తుగా ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో హక్కులను కాలరాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ పార్టీ నాయకులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి ప్రజల హక్కులను కాల రాస్తుందన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరుపాక్షి, ఏఐటియుసి నాయకులు చెన్నరాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా శీన, తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వైసీపీది ప్రజల ప్రభుత్వం

జెసి.. నీచ సంస్కృతి మానుకో: పైలా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

విలేకరులతో మాట్లాడుతున్న పైలా

జగన్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రతిపక్ష టిడిపి పందికొక్కుల పార్టీ అని వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. తాడిపత్రి రూరల్ పరిధి గన్నెవారిపల్లి కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పైలా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టి ప్రజలను, ప్రజాధనాన్ని పందికొక్కుల్లా తిన్నారన్నారు. తాడిపత్రిని అభివద్ధి చేశానని సొల్లు కబుర్లు చెప్పుకునే జెసి ప్రభాకర్ రెడ్డి నీచ సంస్కతిని మానుకోవాలని హితవు పలికారు. రెండు నెలల క్రితం అనంతపురం కలెక్టరేట్లో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను దుర్భాషలాడుతూ చేసిన వ్యాఖ్యలు జెసి ఎలాంటి వాడో తెలియజేశాయన్నారు. 'స్పందన' ప్రజల కోసం ఏర్పాటు చేయబడిందని తద్వారా ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. తాడిపత్రి అభివద్ధికి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కషి చేశారన్నారు. నూతన కూరగాయల మార్కెట్, సిబి రోడ్డు వెడల్పు లాంటివి తప్ప జెసి చేసిందేమీలేదన్నారు. ప్రధాన రోడ్డుపై ఉన్న కాంప్లెక్స్‌లలో మీ అనుచరులకే కట్టబెట్టావని ధ్వజమెత్తారు. జయభారత్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సమయంలో మున్సిపల్ ఆస్తులను కాజేయడానికి ప్రయత్నం చేయగా తాము వాటిని కాపాడామన్నారు. ఇకనైనా జెసి భాష మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు రంగనాథరెడ్డి, గురు ప్రసాద్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్ ప్రచారాలను ఆపాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో ముందస్తు అడ్మిషన్ల కోసం ప్రచార కార్యక్రమాలు చేపడుతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలపై విద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఓ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం పట్టణంలో పలుచోట్ల బ్యానర్లు ఏర్పాటు చేయగా బుధవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు అంజి, ఏఐవైఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి కొత్రేష్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు బయటి ప్రాంతంలోని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు పట్టణంలో పలు చోట్ల బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆయా విద్యాసంస్థల గొప్పలు చెబుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మభ్యపెట్టి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిని నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలం చెందారని మండిపడ్డారు. ఇకనైనా మండల విద్యా శాఖ అధికారులు స్పందించి ముందస్తు ప్రచారానికి పాల్పడుతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు అరవింద్, తరుణ్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ కాలనీలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఎస్.ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎ.పి చేతి వత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఐకాన్ ఆప్టికల్స్ సహకారంతో చాకలి ఐలమ్మ కాలనీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ జన్మదినం సందర్భంగా ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ రమేష్ నారాయణ, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ఐక్యరాజ్యసమితి అవార్డ్ గ్రహీత బిసాటి భరత్, రచయిత, కవి గుంటి మురళీకష్ణ, ఎ.పి చేతి వత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య, కార్యదర్శి సివి హరికష్ణ, రాష్ట్రపతి అవార్డ్ గ్రహీత జీవన్ కుమార్, ఆప్తమాలిస్ట్ నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పేదలు, వృద్ధుల కోసం సుంకర రమేష్ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ శిబిరంలో 150 మందికి కంటి, రక్త నిర్ధారణ, బి.పి పరీక్షలు చేసి మందులు, ఐ డ్రాప్స్, మాస్కులు, సిరప్‌లు అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు దివ్య తేజ, రాష్ట్ర సేవా అవార్డ్ గ్రహీత జయ మారుతి, మాజీ ఉప సర్పంచి లలిత, ఈడిగ ప్రసాద్ గౌడ్, కాలనీ సహాయ కార్యదర్శి భూషణ, తుకారాం, పనేశ్వర, దీప కిరణ్, నందిత, సి.పి.ఐ నాయకులు శ్రీన, నాగరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.

పెన్నోబిలేశునికి వెండి శఠగోపం వితరణ

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన పెన్న అహోబిలంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి బుధవారం ఓ భక్తుడు వెండి శఠగోపం విరాళంగా అందజేశాడు. కర్నూలు నగరానికి చెందిన అభిస్ట గణపతి మేనేజింగ్ ట్రస్టుకు చెందిన జంపాల మధుసూదన్, జంపాల శ్రీకాంతి అరకిలో కిలో(501 గ్రాములు) వెండితో తయారు చేసిన శఠగోపాన్ని ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం ఆలయంలో శఠగోపానికి ప్రత్యేక పూజలు చేసి దాత దంపతులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక నుంచి స్వామివారిని దర్శించుకునే భక్తులను ఆశీర్వదించేందుకు ఈ వెండి శఠగోపం ఉపయోగిస్తామని అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీస్వామి తెలిపారు.

ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌కు వెండి శఠగోపం అందజేస్తున్న భక్తులు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గార్లదిన్నె

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో జరుగుతున్న అభివద్ధి పనులను బుధవారం మండల ప్రత్యేకాధికారి శాంతి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, గ్రామ సచివాలయం, డ్రైనేజీ కాలువ, హెల్త్ క్లినిక్ పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి బయోమెట్రిక్ హాజరు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ విజయభాస్కరరావు, ఎంఈఓ తారా చంద్రనాయక్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగమణి, వ్యవసాయ ఖాఖ అధికారి సోమశేఖర్, ఎంపీడీవో విజయభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు జొన్నలు పంపిణీ

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని రేషన్ కార్డుదారులకు బుధవారం జొన్నలు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్ పర్సన్ డి.వన్నూరుబీ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా కార్డుదారులకు బియ్యంతో పాటు జొన్నలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా చౌక ధాన్యా డిపో ద్వారా లబ్ధిదారులకు ఛైర్ పర్సన్ జొన్నలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.మహబూబ బాషా, సిఎస్‌డిటి కంబక్క, కౌన్సిలర్లు నజీర్, మార్తాండ, హసీన, నాయకుడు మార్తాడు అన్సర్, డీలర్లు నదీముల్లా, దాదు, రషీద్ పాల్గొన్నారు.

ఉరవకొండ: విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామం చౌక ధాన్య డిపోలో బుధవారం ఎంపీపీ కరణం పుష్పవతి భీమిరెడ్డి, తహసీల్దార్ బ్రహ్మయ్య జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల నుంచి రేషన్‌కార్డుదారులకు బియ్యం, చక్కెర, కందిబేడలతో పాటు కిలో జొన్నలు పంపిణీ చేస్తుందన్నారు. లబ్ధిదారులకు సరకులు సక్రమంగా అందించాలని, అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఎండియు ఆపరేటర్లు, చౌక ధాన్య డిపో డీలర్లు లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి లక్ష్మీ దేవమ్మ, సర్పంచి సుశీలా ఉమాశంకర్, వీఆర్వోలు చత్రనాయక్, రంగస్వామి, వైసిపి నాయకులు కరణం భీమ్‌రెడ్డి, ఉమాశంకర్, మాధవరెడ్డి, రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు:రేషన్ కార్డుదారులకు ఉచితంగా జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం తహసీల్దార్ ఈరమ్మ, సర్పంచి వరలక్ష్మి, ఎంపిటిసి వెంకటలక్ష్మి ప్రారంభించారు. పెద్దవడుగూరు మండలానికి 108 క్వింటాళ్ల జొన్నలు మంజూరు కాగా ప్రస్తుతం కార్డుదారులకు వేస్తున్న బియ్యంలో ఒక కిలో తగ్గించి ఉచితంగా కిలో చొప్పున జొన్నలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పెద్దవడుగూరులో జొన్నలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరులో ఇంటింటికీ వెళ్లి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌కార్డుదారుల కు ప్రభుత్వం ఈ నెల నుంచి బియ్యం, చక్కెర, కంది బేడలతో పాటు కిలో జొన్నలు కూడా పంపిణీ చేస్తుందన్నారు. లబ్ధిదారులకు సక్రమంగా సరకులు అందించాలని, అవకతవకలకు పాల్పడితూ ఉపేక్షించేది లేదన్నారు. ఆపరేటర్లు, చౌక ధాన్య డిపో డీలర్లు లబ్ధిదారులకు చేరేలా కషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి, రేషన్ డీలర్లు, వైసీపీ నాయకులు గంగరాజు, శ్రీరాములు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలయ్య,సుంకులమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల పరిధిలోని కాశేపల్లి, గుత్తిఅనంతపురం సమీపంలో వెలసిన ముత్యాలయ్య, సుంకులమ్మ తిరుణాల ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు గ్రామాలతో పాటు పెద్దవడుగూరులో ఉత్సవాలకు వెళ్లే ప్రజలు ఎద్దులను అందంగా అలంకరించి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ఆలయం వద్ద ఉన్న బండిశూల రథాన్ని పామిడి మండలంలోని రామరాజుపల్లి నుంచి కాశేపల్లి మీదుగా గుత్తిఅనంతపురం వద్దకు ఎద్దులతో లాగిస్తారు. వీటిని తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఇక్కడి ప్రజలు ఐదురోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో తిరుణాల ఉత్సవాలను చేసుకొంటారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి నాయకుడు శివశంకర్‌రెడ్డి కుమారుడు సాయి దినేష్ భార్య రోహిణి పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అన్నదానం చేశారు. అంతకుముందు ప్రభుత్వాస్పత్రిలో రోహిణి కేక్ కోశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి సింగిల్ విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామ్ రెడ్డి హాజరయ్యారు. రోహిణి మాట్లాడుతూ పుట్టినరోజును ప్రభుత్వాస్పత్రిలో జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రమణా నాయక్, ఆస్పత్రి సిబ్బంది, వైసిపి నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాసులు నాయక్, తదితరులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

బావిలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బావిలో పడి మతిచెందిన రాజశేఖర్

ఓ యువకుడు నీరు తాగడానికి వెళ్లి కాలు జారి బావిలో పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన బుధవారం మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామం సమీపంలో చోటుచేసుకొంది. అతడి భార్య తెలిపిన వివరాలు.. డి.హీరేహాల్ మండలంలోని తిమ్మాలాపురం గ్రామానికి చెందిన కురుబ రాజశేఖర్(28) కర్నాటకలో ఓ వివాహ వేడుకకు హాజరై గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో సిద్ధరాంపురం గ్రామ సమీపంలో ఓ బావిలో నీరు తాగేందుకు దిగాడు. అయితే కాలు జారి బావిలో పడడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి భార్య వన్నూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమేదార్ హనుమంతునాయక్ తెలిపారు

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని మన్రో సత్రం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన లక్ష్మన్న ఎద్దుల బండిలో మట్టిని తరలిస్తుండగా సత్రం మిట్ట వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మన్నతో పాటు ఎద్దు తీవ్రంగా గాయపడింది. లక్ష్మన్నను ప్రభుత్వాసుపత్రికి తరలించి అటునుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పెన్న అహోబిలంలో ధ్వజారోహణ పూజలు చేస్తున్న దశ్యం

పెన్న అహోబిలంలో ఘనంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న ఉరవకొండ మండల పరిధిలోని పెన్న అహోబిలంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం గరుడ పట ధ్వజారోహణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ప్రధాన ఆలయంలోని స్వామి మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఉత్సవమూర్తుల సాక్షిగా ఆలయ ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు సకల దేవతలు, ఇటు మానవజాతికి తెలిపేలా గరుడపట ధ్వజారోహణ కార్యక్రమం పూర్తి చేశారు. అనంతరం శ్రీవారిని పల్లకిలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీస్వామి, గుండురావు స్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఎంపీడీవో రంగారావుకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రంగారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు మూడు నెలలకోసారి వేతనాలు ఇవ్వడం దారుణమన్నారు. దీనికి తోడు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమై కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోస్ట్ శాంక్షన్ ఆర్డర్‌లో రూ. 2000 వచ్చినప్పటికీ గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటిదాకా రూ. 1000 మాత్రమే ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యంగా పంచాయతీలో పని చేసే కార్మికులకు ఎలాంటి భద్రత పరికరాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కావున వెంటనే పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఎంపీడీవోను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఉమాగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యుడు సూరి, పంచాయతీ కార్మికులు రామకష్ణ, రంగనాథ, రాజు, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

In the court of the Principal District Judge:Ananthapuramu
E.P.NO:947/2022 in A.A.NO:45/2022

Between:
Shriram City Union Finance Limited, Branch-1, Ananthapuramu Rep by its Anthorised Signatory, B.Anand ...D.Hr
And
H.Hazi Akbar and another ...J.Drs

Notice to J.Dr No:1

J.Dr No:1 H.Hazi Akbar S/o H.Hussain Sab, Residing at D.No:4-122, Vidyaranaya Nagar, Kalyanadurgam Road, Ananthapuramu Town.

పై నెంబరు కేసులో 1వ J.Dr అయిన మీ హాజరు నిమిత్తము 05-05-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
జె.ఎల్.నరసింహులు, అడ్వకేటు, అనంతపురం

In the court of the Principal District Judge:Ananthapuramu
E.P.NO:951/2022 in A.A.NO:53/2022

Between:
Shriram City Union Finance Limited, Branch-1, Ananthapuramu Rep by its Anthorised Signatory, B.Anand ...D.Hr
And
M.Ramanjaneyulu and another ...J.Drs

Notice to J.Dr No:1

J.Dr No:1 M.Ramanjaneyulu S/o Late M.Lingappa,R/at D.No:4-523, Vidyaranaya Nagar, Papampeta, Ananthapuramu Buss: Fast Food Center, Now R/at D.No:2/45, Lakshmampalli Village, Settur Mandal, Ananthapuramu Dist.

పై నెంబరు కేసులో 1వ J.Dr అయిన మీ హాజరు నిమిత్తము 05-05-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
జె.ఎల్.నరసింహులు, అడ్వకేటు, అనంతపురం